ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 29 ఆగస్టు 2025



ఏకదంతాయ.. విభిన్న రూపాయ

- ఘనంగా వినాయక చవితి
- వాడవాడలా కొలువుదీరిన విగ్రహాలు



కొత్తవలస ప్రధాన రహదారిలో జొన్నపొత్తులతో రూపొందించిన 21 అడుగుల వినాయకుడు



పాలకొండ: గొల్లవీధి జంక్షన్‌లో కొలువైన వినాయకుడు

జిల్లా వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రజలు ఘనంగా ఈ వేడుకలను జరుపుకొన్నారు. ముందుగా వినాయక విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి మండపాల్లో కొలువుదీర్చారు. జై గణేషా.. జైజై గణేషా అంటూ యువకులు, మహిళలు, చిన్నారులు సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లను నైవేద్యంగా పెట్టారు. వివిధ రూపాల్లో కొలువైన గణనాథులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద మైక్‌సెట్లు ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

మరిన్ని ఫొటోలు 6లో..





పాలకొండ: బోనాం వీధిలో కొలువుదీరిన 20 అడుగుల గణనాథుడు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారిలోని వినాయకుని ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

వారంలో.. ఒకరోజే

- వర్షా కాలంలోనూ తాగునీటి సమస్య
- పార్వతీపురం పట్టణ ప్రజలకు తప్పని అవస్థలు
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇన్‌ఫిల్టర్ బావి గొట్టాలు
- ప్రధాన పంప్‌హౌస్‌లో మరమ్మతులకు గురైన మోటారు



పార్వతీపురంటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురాన్ని వర్షాకాలంలో కూడా తాగునీటి సమస్య వేధిస్తోంది. పార్వతీపురం మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లు అవుతున్నా.. గ్రేడ్ -1 మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 25 ఏళ్లు కావస్తున్నా తాగునీటి సమస్య మాత్రం తీరడం లేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా ఈ సమస్యను పరిష్కరించేవారు కరువయ్యారు. ప్రతి ఏడాది తాగునీటి సరఫరా కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు అధికారులు, పాలకులు చెబుతున్నారు. కానీ, వారం రోజులకొకసారి కూడా కుళాయిల నుంచి నీరు రావడం గగనమైంది. వర్షాకాలం వచ్చిందంటే నాగావళి వరదలతో రంగుమారిన నీటిని సరఫరా చేస్తున్నారని, గత్యంతరం లేక ఆ నీటిని తాగుతున్నామని పట్టణ వాసులు వాపోతున్నారు.

గొప్పలే మిగిలాయి..

గత కొన్నేళ్లుగా జిల్లా కేంద్రాన్ని తాగునీటి సమస్య వేధిస్తోంది. సమస్యను పరిష్కరిస్తామని గత వైసీపీ పాలకులు జిల్లా కేంద్రవాసులకు అరచేతిలో వైకుంఠాన్ని చూపించారు. రూ.63.63 కోట్ల అంచనా వ్యయంతో సంపూర్ణ తాగునీటి సరఫరా పథకం ఏర్పాటు చేస్తామని అప్పటి పాలకులు గొప్పలు చెప్పారు. ఈ పథకానికి సంబంధించి పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద 2019లో అప్పటి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే అలజంగి జోగారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, భూమి పూజ చేశారు. కానీ, పనులు మాత్రం చేపట్టలేదు. గరుగుబిల్లి మండలం సీతారాంపురం వద్ద గ్రావిటీ స్కీమ్ ఏర్పాటు చేసి, తోటపల్లి ప్రాజెక్టు ద్వారా నాగావళి నది నుంచి నీటిని నేరుగా పార్వతీపురానికి సరఫరా చేస్తామని అప్పటి ఎమ్మెల్యే జోగారావుతో పాటు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కూడా ప్రకటనలు చేశారు. ఈ మేరకు 2022లో ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ, అది కార్యరూపం దాల్చలేదు. గత ప్రభుత్వం హామీలే తప్పా అమలు (మిగతా 8వ పేజీలో..)



ప్రధాన పంప్‌హౌస్ వద్ద పనిచేయని 75 హెచ్‌పీ మోటారు



ఉపయోగంలో ఉన్న మొదటి, మూడవ ఇన్‌ఫిల్టర్ బావులు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

- భార్యను హత్య చేసిన భర్త
- మిక్సీ వైరును పీకకు బిగించి చంపేసి పరారీ
- సాలూరు పట్టణంలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

సాలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పండగ పూట మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని భార్యను హత్య చేసి భర్త పరారైన ఘటన సాలూరు పట్టణం దుగ్గాన వీధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మక్కువ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన రాయల త్రివేణి (38)కి, పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన రామకృష్ణకు కొన్ని సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఆదిత్య, మహేందర్ ఉన్నారు. సాలూరు పట్టణంలోని దుగ్గాన వీధిలో ఓ అద్దె ఇంట్లో చిన్నకుమారుడు మహేందర్‌తో కలసి రామకృష్ణ, త్రివేణి నివాసం ఉంటున్నారు. రామకృష్ణ తాపీ మేస్త్రీగా పని చేస్తుంటుగా, త్రివేణి భర్తతో కలిసి కూలి పనికి వెళ్లేది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పనులు లేక ఇద్దరూ ఇంటి వద్దనే ఉంటున్నారు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని భార్య త్రివేణిని రామకృష్ణ అడిగాడు. అందుకు ఆమె నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన రామకృష్ణ ఇంట్లో ఉన్న మిక్సీ వైరును త్రివేణి మెడకు బిగించి గట్టిగా లాగడంతో మృతి చెందింది. రాత్రి 7.30 గంటల సమయంలో వినాయక ఉత్సవాల్లో పాల్గొని ఇంటికి వచ్చిన చిన్న కొడుకు మహేందర్ తల్లి విగతజీవిగా పడిఉండడాన్ని చూశాడు. ఆమెను లేపేందుకు ప్రయత్నించగా ఉలుకుపలుకు లేకపోవడంతో ఏమైందని తండ్రిని అడిగాడు. 'మీ అమ్మ గుండెపోటుతో పడిపోయిందని. ఈ విషయం సాలూరు గొల్లవీధిలో ఉంటున్న మీ పెద్దమ్మ బందారి మంగకు చెప్పు' అని రామకృష్ణ తన కుమారుడికి చెప్పి పంపించాడు. అనంతరం రాత్రి 8.30 సమయంలో త్రివేణిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యులకు చూపించాడు. అప్పటికే ఆమె మృత్యువాత పడినట్లు వైద్యులు ధ్రువీకరించటంతో అక్కడ నుంచి రామకృష్ణ పరారయ్యాడు. కుమారుడు మహేందర్ వెంటనే కాకినాడలో బార్బర్ వృత్తి చేసుకొని ఉంటున్న తన అన్నయ్య ఆదిత్యకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అనంతరం పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ అప్ప నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.



త్రివేణి (ఫైల్)



నిందితుడు రామకృష్ణ

తుది అంకానికి మెగా డీఎస్సీ

- అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- తొలిరోజు 398 మందికి పిలుపు
- రాత్రి వరకూ కొనసాగిన ప్రక్రియ

సాలూరు రూరల్,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. డెంకాడ మండలం మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆర్జేడీ విజయభాస్కర్, పార్వతీపురం, విజయనగరం డీఈవోలు బత్తుల రాజకుమార్, యు.మాణిక్యాలనాయుడు పర్యవేక్షణలో ఎనిమిది బృందాలు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నాయి. తొలి రోజు 398 మంది అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు అధికారులు పిలిచారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 244 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్టు తెలిసింది. రాత్రి ఎంత సమయమైనా మిగతా అభ్యర్థుల సర్టిఫికెట్లను కూడా పరిశీలించనున్నారు.

583 టీచర్ పోస్టులు..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 583 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 6 నుంచి జూలై 2 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. గత నెల 11న అభ్యర్థులకు వ్యక్తిగత స్కోర్ కార్డులతో ఫలితాలు విడుదల చేశారు. ఈ నెల 23న ఎజీటీ మెరిట్ జాబితాను 7,725 మందితో ప్రకటించారు. పాఠశాల సహాయకుల కేటగిరీలో ఆంగ్లానికి 665 మందితో, గణితంలో 1,497 మంది, ఫిజికల్ సైన్స్ 1,398 మంది, సోషల్ 2,618 మంది, తెలుగు 885 మంది, బయాలజీ 1359 మందితో మెరిట్ జాబితాను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో (మిగతా 8వ పేజీలో..)



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏరియా ఆసుపత్రిలో
గర్భిణి మృతి
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ
7లో

కళలను రక్షిస్తూ.. భాషను కాపాడుతూ
- తెలుగు భాష మనుగడ కోసం భాషాభిమానుల కృషి
6లో
- నేడు తెలుగు భాష దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

బస్తా ఎరువు కోసం పడిగాపులు
6లో

వర్షం వస్తే.. వీరికి ఇక్కట్లే
6లో

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు
7లో

ఉప్పొంగుతున్న నదులు

- సువర్ణముఖి, గోముఖి, నాగావళికి వరద పోటు
- ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తుండడమే కారణం



తోటపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసిన నీరు

సాలూరు రూరల్/గరుగుబిల్లి/మక్కువ/రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో దక్షిణ ఒడిశాలోని కొఠియా దేవ్ కొండల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలోని సువర్ణముఖి, గోముఖి, నాగావళి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. సాలూరు మండలం దిగువ మెండంగి వద్ద ఫైప్‌డ్ కాజ్‌వేపై గోముఖి (మిగతా 8వ పేజీలో..)

అందుబాటులోకి వస్తే..

ఇక్కట్లు తప్పినట్లే!

- శరవేగంగా ఎంపీఎఫ్‌సీల నిర్మాణం
- జిల్లాలో 20 చోట్ల ఏర్పాటుకు శ్రీకారం
- ఇప్పటికే 11 చోట్ల పూర్తి
- రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం

జియ్యమ్మవలస, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మల్టీ పర్పస్ ఫెసిలిటి సెంటర్లు (ఎంపీఎఫ్‌సీ) నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది రూపాయలతో వాటి పనులు చేపడుతున్నారు. 500 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంచుకునే విధంగా గోడౌన్లు నిర్మిస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే రైతుల సమస్యలు కొంతవరకు పరిష్కారమవుతాయి. ప్రధానంగా అధిక దిగుబడులు వచ్చి సరైన గిట్టుబాటు ధర రాని సమయంలో ఆ పంటలను ఎంపీఎఫ్‌సీలలో నిల్వ ఉంచుకోవచ్చు. ఒకవేళ పంట తడిసిపోతే దానిని పక్కనే ఉన్న ప్లాట్‌ఫార్మ్‌పై ఆరబెట్టుకొని ఆ తరువాత గోడౌన్‌ల్ ఉంచొచ్చు. పీఏసీఎస్‌లలో సభ్యులుగా ఉన్న వారు మాత్రమే కాదు రైతులెవరైనా ఇందులో పంటలను ఉంచుకోవచ్చు. ఈ గోడౌన్లను ఒక వ్యక్తికి గాని, సంస్థకు గాని అద్దెకు లేదా లీజుకు ప్రభుత్వం ఇస్తుంది. ఇందుకోసం సంబంధిత పీఏసీఎస్ సీఈవోను సంప్రదించాల్సి ఉంటుంది.

ఇదీ పరిస్థితి

- జిల్లాలో 15 మండలాల పరిధిలో 42 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. మొత్తంగా 49 వేల మంది సభ్యులు (రైతులు) ఉన్నారు. రెండు పీఏసీఎస్‌ల పరిధిలో ఒక్కో మల్టీ పర్పస్ ఫెసిలిటి సెంటర్ (పీఎంఎఫ్‌సీ) నిర్మించేందుకు 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ. 43 లక్షలకు పైగా మంజూరు చేసింది. అయితే పనులు మాత్రం నత్తనడకన జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి (మిగతా 8వ పేజీలో..)

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

జిల్లాకు 20 ఎంపీఎఫ్‌సీలు మంజూరవగా ఇంతవరకు 11 భవన నిర్మాణాలు పూర్తి చేశాం. ఈ రెండు నెలల్లో మిగిలిన భవన నిర్మాణాలు పూర్తి చేస్తాం.

- పి.శ్రీరామ్మూర్తి, డీసీవో, జిల్లా కో ఆపరేటివ్ సొసైటీస్, పార్వతీపురం మన్యం





కొమరాడ మండలంలో నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని ఎంపీఎఫ్‌సీ భవనం


రాజాం రూరల్: కంచరాంలో నాణేలతో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడు


మక్కువలో..


గరుగుబిల్లి: సాంబన్నవలసలో గణనాథుడు


దత్తిరాజేరు: వినాయక ప్రతిమ వద్ద స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాలు


రాజాం/రూరల్: పొనుగుటివలసలో 70 అడుగుల ఈఫిల్ టవర్ మండపం



పాలకొండ: పెదకాపువీధి జంక్షన్ వద్ద ఆపరేషన్ సింధూర్ నమూనాతో..


జామి: చుక్క వీధిలో ఉయ్యాలలో వినాయక విగ్రహం

స్వామీ.. వినాయకా!

- నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన ఆదిదేవుడు

గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అనేక వినాయక మండపాలు వెలిశాయి. వివిధ రూపాల్లో గణనాథుడు అందులో కొలువుతీరాడు. తొలిరోజు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

● శృంగవరపుకోట ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోటలోని కాపు వీధిలో శ్రీబాల గణపతి అసోసియేషన్ 45 ఏళ్లగా వినాయక మండపాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రూ.28 వేలు ఖర్చుతో ప్రత్యే కంగా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

● రాజాం/ రూరల్: వినాయకచవితి మండపాల ఏర్పాటులో రాజాం మున్సి పాలిటీలోని పొనుగుటివలస గ్రామం ప్రతి ఏటా ప్రత్యేకత చాటుతోంది. ఈ ఏడాది సుమారు 70 అడుగుల ఎత్తున్న ఈఫిల్ టవర్‌ను ఏర్పాటు చేసి, అందులో ఉయ్యాలలో ఊగుతున్నట్టు గణనాథుడ్ని నెలకొల్పారు.

● దత్తిరాజేరు: పాచలవలసలోని సుంకరివీధిలో వినాయక మండపం వద్ద స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను ఉంచడం ప్రత్యేకత చాటుకుంది.



కొత్తవలస: తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీపంలో మెగాయూత్ ఆధ్వర్యంలో దశావతారంలో వినాయకుడు


విజయనగరం రూరల్: గాజులరేగలోని మహారాష్ట్రలోని దాదార్‌లో హనుమాన్ ఆలయాన్ని పోలిన సెట్


సాలూరు రూరల్: సాలూరులో భారత్ చిత్రపటం, జవాన్, ఝాన్సీరాణితో కూడిన వినాయక విగ్రహం..


సీతంపేట: ఎస్టీ కాలనీలో ఏడున్నర అడుగుల గణనాథుడు


రాజాం రూరల్: మేదరవీధిలో రాముడి అవతారంలో..


భోగాపురం: మహరాజ పేటలో..


రాజాం రూరల్: పక్షిరాజుపై విఘ్నేశ్వరుడు


బొబ్బిలి: చీపురుపల్లి వీధిలో వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారంతో ఏర్పాటుచేసిన వినాయక మండపం



బొబ్బిలి: మల్లమ్మపేటలో ఏరోప్లేన్ సెట్టింగ్‌తో మండపం


ఎస్.కోట: కాపు వీధిలో మట్టి వినాయకుడు


సాలూరు: వడ్డీవీధిలో ఆకట్టుకున్న క్రీడా వినాయకుడు


రాజాం: బొద్దాంలో రూపాయి నాణేలతో గణనాథుడు


సంకిలిలో ఎరువు కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

బస్తా ఎరువు కోసం పడిగాపులు

- అరకొర విక్రయంపై ఐదు గ్రామాల రైతుల నిరాశ

రేగిడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిలి రైతుసేవా కేంద్రంలో గురువారం పంపిణీ చేసిన ఎరువు కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఒక బస్తా ఎరువు కోసం సాయంత్రం వరకు వేచి చూడాల్సి వచ్చింది. కొందరు ఎరువు దొరకక నిరాశతో వెనుదిరిగిన పరిస్థితి ఏర్పడింది. సంకిలి సచివాలయం పరిధిలో సంకిలి, అప్పాపురం, చిన్నయ్యపేట, బొడ్డవలస, మజ్జిరామునిపేట గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాల దాటి ఖరీఫ్ సాగు విసీర్ణం ఉంది. ఎకరాకు ఒక బస్తా ఇచ్చినా వెయ్యి బస్తాలు ఎరువు కావాల్సి ఉంటుంది. తొలిదశలో 450 బస్తాల యూరియా రాగా, హాట్‌కేక్‌లా అమ్ముడుపోయింది. రెండో విడతలో 225 బస్తాలు వచ్చాయి. దీంతో ఐదు గ్రామాల రైతులు ఎరువుకు ఎగబడ్డారు. వారిని నియంత్రించలేక ఒకసారి పంపిణీ నిలిపివేశారు. దీంతో పోలీస్ సిబ్బంది సమక్షంలో పంపిణీ పూర్తి చేశారు. రైతుకు కనీసం ఒక బస్తా కూడా దక్కకపోవడంపై అధికారుల తీరును పలువురు తప్పుపట్టారు. దీనిపై ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ తర్వాత కోటాలో సంకిలికి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


వర్షపు నీరు రాకుండా అడ్డుకట్ట వేస్తున్న విద్యార్థినులు

వర్షం వస్తే.. వీరికి ఇక్కట్లే

- పారలు పట్టుకుని నీటిలోకి దిగాల్సిందే

సీతంపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో వర్షపు నీరు చేరింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి నీరు కళాశాల ఆవరణలోకి రావడంతో మైదానం చెరువులా మారిపోయింది. దీంతో విద్యార్థులు వర్షపునీరు డార్మెటరీ భవనం వైపు రాకుండా పారలతో అడ్డుకట్ట వేశారు. ఈ ప్రాంగణంలో ఏపీఆర్ గురుకుల కళాశాల, పాఠశాల నిర్వహిస్తున్నారు. మొత్తంగా 950 గిరిజన విద్యార్థినిలు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. మురుగునీరు కూడా మైదానంలోకి చేరడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా ఇలాగే వర్షపునీరు కళాశాల మైదానంలో చేరి విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అటు అధికారులు కానీ, ఇటు గురుకుల కళాశాల, పాఠశాల సిబ్బంది కానీ పట్టించుకోక పోవడంతో విద్యార్థినులే పలుగు, పార చేతపట్టి నీటికి అడ్డుకట్ట వేసుకోవాల్సి వచ్చింది. ఇక్కడి పరిస్థితిని డీడీ అన్నదొర దృష్టికి తీసుకుని వెళ్లగా.. కళాశాల మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కళలను రక్షిస్తూ.. భాషను కాపాడుతూ

- తెలుగు భాష మనుగడకోసం భాషాభిమానుల కృషి
- నేడు తెలుగు భాష దినోత్సవం



బొబ్బిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష కనుమరుగు కాకుండా ఎందరో మహానుభావులు కృషి చేస్తున్నారు. అమ్మభాషను పూర్తిగా మరిచిపోయిన రోజువచ్చేస్తోందని, తెలుగు భాషకు ఆ దుస్థితి రాకూడదని భాషాభిమానులు మదన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కళలను రక్షిస్తూ... భాషను కాపాడుకోవడానికి పాటు పడుతున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఆగస్టు 29 పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బొబ్బిలి ప్రాంతంలో తెలుగు భాష మనుగడ కోసం కృషిచేస్తున్న వారికోసం ప్రత్యేక కథనం..

పోతన భాగవతం ప్రచారం


బోదనపల్లి గౌరీనృసింహ ప్రసాదశర్మ

బొబ్బిలి మండలంలోని రాముడువలసకు చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు పీసపాటి నరసింహమూర్తికి తెలుగుభాషపై అపారమైన పట్టు ఉండేది. ఆయన రంగస్థలంపై భాషాప్రయోగ చమక్కులతో తోటి నటీనటులను ఆటపట్టించేవారు. అదే గ్రామానికి చెందిన బోదనపల్లి గౌరీనృసింహ ప్రసాదశర్మ ఊరూరా పోతన భాగవతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రముఖ వేదపండితులు సామవేదుల రామగోపాలశాస్త్రి శిష్యరికంలో భాషా ప్రవీణ, ఎంఏ చదువుకున్న శర్మ తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారపరిషత్ తరఫున ఉపన్యాకులుగా వ్యవహరిస్తున్నారు. పామరులకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో పోతనామాత్యులు భాగవతాన్ని ఆంధ్రీకరించారన్నారు. నేటితరం వారిలో తెలుగుభాష పట్ల ఆసక్తి తగ్గిపోతున్న తరుణంలో ఆ భాష ఔన్నత్యాన్ని, మాధుర్యాన్ని, గొప్పతనాన్ని చాటి చెప్పేందుకు గ్రామీణ ప్రాంతాలు, విద్యాసంస్థలలో శర్మ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను ఆయనకు టీటీడీ 2015లో అవార్డును అందజేసింది. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. అలనాడు శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు లెస్స అని కొనియాడగా, దేశంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులు తెలుగు భాషపై ఆసక్తిని పెంచుకొని అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై చాటిచెప్పిన వైనాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకొని తెలుగుభాషకు పూర్వవైభవాన్ని తీసుకోవాలని శర్మ అభిప్రాయపడ్డారు.

తెలుగునాటక రంగంలో పీసపాటి..

రాముడువలస గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు పీసపాటి నరసింహమూర్తి తెలుగునాటక రంగంలో సుమారు 50 సంవత్సరాల పాటు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలిచ్చి తన ప్రత్యేకతను చాటుకున్నారు. శ్రీకృష్ణపాత్రలో బాగా మెప్పించేవారు. ఎన్టీఆర్‌తో పాటు ఎంతోమంది పండితులు, పామరులు పీసపాటిని పౌరాణిక నాటక రంగంలో ఘనాపాటిగా కీర్తించారు. 20వ శతాబ్దంలో తిరుపతి వేంకటకవులు తెలుగు సాహిత్య, నాటక రంగంలో ఎంతో ప్రాచుర్యం పొందారు. ఆ సమయంలో వారి రచనలు పాండవోద్యోగ విజయాలు వంటి నాటకాల్లో పీసపాటి నాటక ప్రదర్శనలు జనాదరణ పొందాయి. వాచికాంగిక అభినయంలో పీసపాటి పెట్టింది పేరు. రాగయుక్తంగా, భావగర్భితంగా పామురులకు సైతం సునాయాసంగా అర్థమయ్యే రీతిలో పద్యపఠనం చేసేవారు. రంగస్థలంపై భాషకు సంబంధించి ఎటువంటి తప్పిదాలు జరిగినా ఆయన సాటి కళాకారులను ఎంతమాత్రం ఉపేక్షించేవారు కాదు. భాష ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఆయన రాజీ పడే వారు కాదు. 1920 జూలై 10న బలిజిపేట మండలం వంతరాంలో జన్మించిన ఆయన చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. బంధువుల ఆదరణతో జీవనం సాగించారు. బొబ్బిలి మండలం రాముడువలసలో 2007 సెప్టెంబరు 28న ఆయన కన్నుమూశారు. 1938లో నటనాజీవితాన్ని ప్రారంభించారు. ఆయనకు కళారంగ పరంగా ఎవరూ వారసులు లేకపోవడంతో ఆయనతోనే కనుమరుగైంది. 1986లో సంగీత నాటకఅకాడమీ అవార్డును, 1983లో ఆంధ్రాయూనివర్శిటీ నుంచి కళాప్రపూర్ణ బిరుదును అందుకున్నారు.


పీసపాటి నరసింహమూర్తి

ప్రభుత్వపరంగా విధానాలు అమలు చేయాలి..


చినగౌరునాయుడు

బొబ్బిలి పట్టణంలోని నాయుడు కాలనీకి చెందిన మీసాల చినగౌరు నాయుడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో లెక్కలు మాస్టారుకు తెలుగుభాషపై అమితమైన ప్రేమ, అభిమానంతో అనేక రచనలు చేస్తున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో పలు అవార్డులు అందుకున్నారు. స్వతహాగా కళాకారుడు అయిన గౌరునాయుడు తెలుగు భాష అజరామరమైనదని, భాష ఔన్నత్యం ప్రపంచస్థాయిలో గుర్తించబడిందన్నారు. స్థానికంగా గల మన తెలుగువారే గుర్తించలేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నేటి బాలల్లో మాతృభాషపై పట్టుసాధించేందుకు ప్రభుత్వపరంగా తప్పనిసరి విధానాలను అమలు చేయాలని కోరుకుంటున్నామన్నారు.

భాగవతం కళ అంతరించిపోకూడదని...

బొబ్బిలికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మింది విజయ మోహనరావు కళాకారుడు. రచనాసమాఖ్య, ఆనందోబ్రహ్మ వంటి కళాసంస్థలను ఏర్పాటు చేసి భాషా ఉద్యమానికి, తెలుగు నాటకరంగానికి తనవంతు కృషి చేస్తున్నారు. బొబ్బిలి మండలం కోమటిపల్లికి చెందిన బొంతలకోటి శంకరరావు తూర్పుభాగవతం కళాకారుల కుటుంబానికి చెందిన వారు. ఆయన తమ పూర్వీకుల నుంచి వచ్చిన భాగవతం కళ అంతరించిపోకూడదని నేటి తరం బాలలకు తర్ఫీదు ఇచ్చి ప్రదర్శనలు ఇస్తున్నారు.

కాశీ మామయ్య పేరుతో ఎన్నో రచనలు

- తెలుగు భాషకు వన్నె తెస్తున్న కాశీవిశ్వనాథం పత్రాయుడు
- 400 బాలల కథలు, 120 బాల గేయాలు, 50 సాంఘిక కథలు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తెలుగు భాషకు ఆదరణ తగ్గుతోంది. ఇటువంటి రోజుల్లో తెలుగు భాషపై అందరికీ మక్కువ పెంచేలా కాశీవిశ్వనాథం పత్రాయుడు ఎంతో కృషి చేస్తున్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనపై ప్రత్యేక కథనం. ఎస్.కోట మండలంలోని చామలాపల్లి గ్రామానికి చెందిన కాశీవిశ్వనాథం పత్రాయుడు.. కాశీ మామయ్య కలం పేరుతో గత దశాబ్ద కాలంగా ఎన్నో రచనలు చేస్తున్నారు. ఈయన ప్రస్తుతం బొడ్డవర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తెలుగు భాషకు సంబంధించి ఇప్పటివరకు 400 బాలల కథలు, 120 బాల గేయాలు, 50 సాంఘిక కథలు రచించారు. ఈయన రచించిన కాశీ మామయ్య కథలు, దేవునికి ఉత్తరం, అద్భుతం, తాతయ్య కల, ఉంటే ఉగాది లేదంటే శివరాత్రి, బుంగమూతి, పెద్దమ్మ చూపిన మార్గం, మౌన మేలనోయి అనే పుస్తకాలను అచ్చు వేయించి వెలువరించారు. ఇవి ఎంతగానో పాఠకుల ఆదరణ పొందాయి. ఇక ఈయన సతీమణి గుమ్మ నాగమంజరీ కూడా ప్రముఖ రచయిత్రి కావడం మరో విశేషం.


అవార్డులతో కాశీవిశ్వనాథం పత్రాయుడు

సన్మానాలు.. పురస్కారాలు

కాశీవిశ్వనాథం ఇప్పటివరకు అనేక సన్మానాలు పొందారు. తెలుగు కవితా వైభవం (హైదరాబాద్) వారి సాహిత్య మిత్ర, తెలుగుప్రతి లిపి వారి కవి విశారద, గురజాడ ఫౌండేషన్ (అమెరికా)వారి రాష్ట్ర స్థాయి పురస్కారం, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు, బాలానందం సంఘ అవార్డులు, జాతీయ ఉత్తమ బాలసేవక్ పురస్కారం, సర్వేపల్లి జాతీయ విశిష్ట సేవా పురస్కారం పొందారు. అలాగే బాల సాహితీవేత్తల సరసన వికిపీడియాలో ఈయన పేరు చేర్చారు.

రైల్వేస్టేషన్‌ను తనిఖీచేసిన ఎంపీ



ప్రయాణికులతో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రైల్వేస్టేషన్‌ను ఎంపీ కలిశెట్టి అప్పలనాయడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టికెట్ బుకింగ్ కౌంటర్‌తో పాటు విచారణ కేంద్రం అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వాహణ, ప్రయాణికుల విశ్రాంత గదులు తదితర అంశాలపై స్టేషన్ అధికారులతో సమీక్షిం చారు. రైల్వే ప్లాట్‌ఫారం పురోగతి, స్టేషన్‌లో ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విజయనగరం రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం పలు అంశాలపై పార్లమెంటు లో చర్చించినట్లు చెప్పారు.

చల్లపేటలో సీఐ పల్లెనిద్ర

మెంటాడ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస కావద్దని గజపతినగరం సీఐ రమణ హితవుపలికారు. చల్లపేట గ్రామంలో గురువారం రాత్రి ఆయన పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో నిద్రించారు. ఆండ్ర ఎస్‌ఐ సీతారాం, ఏఎస్‌ఐ వి.రమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

గజపతినగరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపితే తల్లిదండ్రులతో పాటు అత్తమామలపైన కేసులు నమోదు చేస్తామని, జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

రాజాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించన్ను చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మొయ్యి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక సర్పంచ్‌గా సుందరమ్మ

దత్తిరాజేరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెదమానాపురం తాత్కాలిక సర్పంచ్‌గా గొటివాడ సుందరమ్మ ఎన్నికైంది. గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను ఈవోపీఆర్‌డీ వాణిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత సర్పంచ్ గొటివాడ దాసు ఈ ఏడాది మృతిచెందడంతో తాత్కాలిక సర్పంచ్‌కు ఎన్నిక చేపట్టారు. ఈ మేరకు 12మంది వార్డు సభ్యులకుగాను నలుగురు సభ్యులు గైర్హాజరు కాగా 8 మంది సభ్యులు గొటివాడ సుందరమ్మ నియామకానికి ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతూ చేతులుఎత్తారు. దీంతో గొటివాడ సుందరమ్మ తాత్కాలిక సర్పంచ్‌గా ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గణేశా.. జిందాల్ యాజమాన్యానికి బుద్ధిని ప్రసాదించు.. అంటూ బొడ్డవర గ్రామం వద్ద నిర్వాసితులు కోరారు. గురువారం వినాయక విగ్రహాన్ని తలపై పెట్టుకుని ర్యాలీగా వెళ్లారు. అనంతరం నిమజ్జనం చేశారు. జిందాల్ యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు.

ముంపు పొలాల పరిశీలన

డెంకాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డెంకాడ మండలంలో మోదవలస, సింగవరం గ్రామాల్లోని పొలాలు ముంపునకు గురయ్యాయి. ఈ పొలాలను ఏడీఏ ఎ.నాగభూషణరావు, ఏవో టి.సంగీత గురువారం పరిశీలించారు. మోదవలసలో 15.25 ఎకరాలు, సింగవరంలో 14.75 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైందని ఏడీఏ తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.రామకోటి, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భోగాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏఈ మస్తాన్‌వల్లి తెలిపారు. ఎ.రాయవలస, గూడెపువలస, ఆర్‌అండ్‌ఆర్ కాలని, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, చాకివలస, ఎయిర్‌పోర్టు ఏరియాలలో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు. ● లక్కవరపుకోట: ఎల్.కోటలో గల ప్రధాన విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. సోంపురం జంక్షన్, ఎల్.కోట, సంతపేట జంక్ష న్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ● ఎస్.కోట రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7గంట ల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ సురేష్‌బాబు తెలిపారు. బొడ్డవర, కృష్ణమ హంతిపురం, పెదఖండేపల్లి, యాళ్లపేట, ఆడ్డతీగ, గౌరిపురం, తదితర గ్రామాల్లో సరఫరా ఉండదని చెప్పారు.

కదం తొక్కిన ఆటో కార్మికులు

● జిల్లా వ్యాప్తంగా నిరసన

ఎస్.కోట రూరల్, గరివిడి, రాజాం, వేపాడ: ఆటో డ్రైవర్లు కదం తొక్కారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టి తమ జీవనాధారం దెబ్బతీసిందని వాపోతూ గత కొన్ని రోజులుగా వీరంతా నిరసన చేపడుతున్నారు. దీనిలో భాగంగా గురువారం విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లంతా ఆందోళన చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల బిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



రాజాం: ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి: ఎస్పీ

గరివిడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గరివిడి పోలీసు స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. సిబ్బందికి పలు సలహాలు ఇచ్చారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, గరివిడి ఎస్‌ఐ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: నేరాల నియంత్రణ, దర్యాప్తులో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ సంఖ్యలో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రిసెప్షన్ పనితీరు, కేసుల నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. ఎస్‌ఐ దామోదరరావుకు పలు సూచనలు చేశారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు ఉన్నారు.



చీపురుపల్లి: రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

హెల్మెట్ తప్పనిసరి

విజయనగరం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలతో బయట పడేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో గత వారం రోజులుగా హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారిపై 452 కేసులు నమోదు చేసి, రూ.4లక్షల 75వేల725 ఈ-చలానా విధించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌స్పాట్స్ హైవేలపై ముఖ్య కూడళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ ధరించని వాహనదారు లపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యారెడ్డి, రాఘవులు పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

భోగాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. గురువారం పోలిపల్లి గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డీఎస్సీని ఆపడానికి జగన్మోహన్‌రెడ్డి 24 కేసులు వేయించారని, అవన్నీ తట్టుకుని విజయవంతంగా పూర్తిచేసిన ఘనత మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు. గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నారన్నారు. పార్టీ నాయకులు గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, నీలాపు అప్పలరామిరెడ్డి, ముని పైడయ్య, నల్లం శ్రీనివాసరావు, కాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నిర్వహించిన ఘనత లోకేశ్‌దే

విజయనగరం రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు న్యాయం చేసిన ఘనత లోకేశ్‌కే దక్కుతుందని, ఇందుకు డీఎస్సీ నిర్వహణే ఉదాహరణని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున చెప్పారు. గురువారం ఆయన విజయనగరంలో విలేకర్లతో మాట్లాడారు. డీఎస్సీ ద్వారా చాలా వేలమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు విద్యా రంగాన్ని దేశంలోనే ప్రథమస్థానంలో నిలబడేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేసిన కృషి హర్షణీయమన్నారు. డీఎస్సీని అడ్డుకోవడానికి వైసీపీ నాయకులు కేసులు వేశారని ఆయన ఆక్షేపించారు.

డిపాజిట్ల సేకరణ లక్ష్యం రూ.400 కోట్లు

● డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు

విజయనగరం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.400 కోట్లు డిపాజిట్లు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇంతవరకు రూ.325 కోట్లు సేకరించామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి చిప్పాడ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో అన్ని డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా డిపాజిట్లు సేకరిస్తున్నామని చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా డీసీసీబీ లాభాల బాటలో నడుస్తుందని తెలిపారు. ఆర్థికపరమైన ఇబ్బందులు నుంచి గట్టెక్కి, డివిడెంట్లు ఇచ్చే స్థాయికి బ్యాంకు కలిగిందని చెప్పారు. 109 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ బ్యాంకు ద్వారా రైతాంగానికి ఇతోదికంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. గుర్ల బ్రాంచి ద్వారా అత్యధికంగా రూ.20 కోట్లు రుణాలను అందించామని ఆయన అన్నారు. జిల్లాలో రైతులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రూ.300 కోట్లు పంట రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇంతవరకు రూ.65 కోట్లు రుణాలను అందించామని ఆయన తెలిపారు.

పోక్సో కేసు నమోదు

లక్కవరపుకోట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మేడపురెడ్డి మధు అనే యువకుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైనట్టు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధు తన గ్రామంలోని ఓ బాలికను ప్రేమించినట్టు నమ్మించి.. గర్భవతిని చేశాడు. విశాఖ కేజీహెచ్ వైద్యుల నివేదికను ఆధారంగా చేసుకుని పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ విచారణ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయి.

మారిక రోడ్డుపై జారి పడ్డ బండరాళ్లు



వేపాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కరకవలస పంచాయతీ శివారు మారిక గ్రామ రహదారిపై బండరాళ్లు జారిపడ్డాయి. దీంతో మారిక గిరిజనులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రెల మృతి

వంగర, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తలగాం గ్రామంలో బుధవారం వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన పడాల రాము గురువారం తన గొర్రెలను శాలలో ఉంచి, పొలం పనులకు వెళ్లాడు. ఇంతలోనే కుక్కలు మూకుమ్మడిగా శాలలోకి చొరబడ్డాయి. దొరికిన గొర్రెలపై దాడి చేసి, పీకలు కొరికి చంపేశాయి. దీంతో రాము తన జీవనాధారం పోయిందని లబోదిబోమంటున్నాడు.

సచివాలయాల తనిఖీ

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 31, 38 డివిజన్‌లోని సచివాలయాలను నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు గురువారం తనిఖీ చేశారు. ముందుగా ఎంఎస్‌ఎన్ కాలనీలోని సచివాలయానికి చేరుకున్న ఆయన రికార్డులను, హాజరు పట్టీని పరిశీలించారు. కార్యదర్శులు విధి నిర్వహణలో ఏ విధంగా చేపడుతున్నారని ఆరా తీశారు. మెరుగైన పౌరసేవలు అందించాలన్నారు. అలాగే ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అన్నక్యాంటీన్‌ను పరిశీలించి, ఆహారం, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. గురువారం ఆయన కేఎల్ పురం ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరాతీశారు. కాలువలు, తాగునీటి సమస్యలపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం రూ.2లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. వీధి దీపాల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

నెల్లిమర్ల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీతారామునిపేటలో స్వామిత్వ సర్వేను డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషరాణి గురువారం పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్, పంచాయతీ కార్యదర్శి బంగారురాజు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఒకరి మృతి, 13 మందికి గాయాలు

సీతానగరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరిపివలస సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో బుధవారం ఒకరు మృతి చెందగా, 13 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఆర్టీసీ బస్సు రామమహేంద్రవరం నుంచి పార్వతీపురం వస్తున్న క్రమంలో మరిపివలస సమీపంలో బస్సు చెట్టును ఢీకొంది. దీంతో బొబ్బిలి మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎ.శ్రీను (45) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 13 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బొబ్బిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని యాతవీధికి చెందిన గొంప దాడిబాబు (25) బుధవారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు.. దాడిబాబు కొబ్బరి బొండాలు అమ్ముకుని జీవనం సాగిస్తాడు. బుధవారం మధ్యాహ్నం బొండాలు అమ్మికొని ఇంటికి వచ్చి భోజనం చేసిన తరువాత ఇంట్లో టేబుల్ ఫ్యాన్ వేసుకొని నిద్రించాడు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కరెంటు వైరు కాలుతున్న వాసన వచ్చిన విషయాన్ని భార్యరాధ గమనించింది. వెంటనే కేకలు వేసి తన అత్త లక్ష్మిని పిలిచింది. కరెంటు షాక్ తగిలి ఊపిరి ఆడకుండా ఉన్న దాడిబాబును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు పరిశీలించి దాడిబాబు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సీఐ కటకం సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మృతదేహానికి గురువారం సీహెచ్‌సీలో పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు. భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు.

లోవరకండిలో యువకుడి హత్య

మక్కువ రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దేవరశిర్లాం పంచాయతీ పరిధిలో ని లోవరకండిలో గురువారం సాయంత్రం ఓ యువకుడు హత్యకు గురయ్యా డు. గ్రామానికి చెందిన యువకులు గురువారం సాయంత్రం వాలీబాల్ ఆటాడు న్నారు. ఆ సమయంలో సాగరపు కార్తీక్, సాగరపు ఆది మధ్య స్వల్పవివాదం తలెత్తింది. ఇరువురి మధ్య మాటా మాట పెరిగి వివాదం పెద్దదైంది. దీంతో సాగరపు ఆది ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి సాగరపు కార్తీక్ ఇంటికి వెళ్లి పొడిచా డు. దీంతో తీవ్రగాయాలైన కార్తీక్‌ను తల్లిదండ్రులు దాలిందొర, దమయంతిమ్మ పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే కార్తీక్ ఆసుపత్రికి చేరే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో ఉంచారు. తల్లిదండ్రులు తమ కుమారుడిని అన్యాయంగా పొట్టన పెట్టుకున్నాడని బోరున విలపిస్తున్నారు.

డబ్బులిస్తే అశ్లీల వీడియో తొలగిస్తామని బెదిరింపులు

భామిని, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అశ్లీల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తమిళనాడులోని కోయంబత్తూరులో లేబరు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. తన భార్య తమ గ్రామానికి వచ్చిన తరుణంలో అదే గ్రామానికి చెందిన భార్యాభర్తలు తన భార్యకు సంబంధించి అశ్లీల వీడియోలు రికార్డింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని భర్త ఆరోపించాడు. డబ్బు ఇస్తేగాని వీడియోను తొలగించమని ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయం తెలయడంతో ఆ మహిళ భర్త పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. కాగా అశ్లీల వీడియో విషయం తమ దృష్టికి వచ్చిందని, బాధిత మహిళ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ జి.అప్పారావు తెలిపారు.

మృతుడి వివరాలు లభ్యం

కొత్తవలస, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కొత్తసుంకరపాలెం సమీపంలోని కోనేరులో పడి మృతిచెందిన వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయని సీఐ షణ్ముఖరావు గురువారం తెలిపారు. ఈనెల 26న కొత్తసుంకరపాలెం కోనేరులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు శ్రీకాకుళం జిల్లా, జి.సిగడాం మండలంల, బాతుత పోస్టు, పున్నం గ్రామానికి చెందిన అలుగోలు తవుడు(48)గా కుటుంబ సభ్యులు గురువారం గుర్తించారు. మృతుడి భార్య సత్యమణి, కుమారులు భార్గవ కృష్ణ, సురేష్‌కుమార్‌లు ఇక్కడకు వచ్చి, మృతదేహాన్ని చూసి, గుర్తుపట్టారు. తవుడు కొత్తవలస పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ కార్పెంటర్ పని చేసుకుంటున్నాడు. తవుడుకు మద్యం అలవాటు ఉందని భార్య తెలిపింది. అయితే ఈనెల 24న ఆయన మరో ఇద్దరితో కలిసి ఆటోలో వెళ్లి మద్యం తాగారు. వారు చెరువులో కలువ పువ్వులు కోసి అమ్మాలని భావించి, కోనేరులోకి దిగారు. అయితే తవుడుకు ఈత రాకపోవడంతో మునిగిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

పోలీసులపై దాడి.. ముగ్గురిపై కేసు

వేపాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పోలీసులపై దాడి చేసిన ముగ్గురు యువకులపై వల్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్.కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ గ్రామ రెవెన్యూలో గల అప్పన్న చెరువు వద్ద బుధవారం సాయంత్రం గణపతి విగ్రహాలు నిమజ్జనం చేస్తుండగా.. వల్లంపూడి ఏఎస్‌ఐ బి.నాగేశ్వరరావు, కానిస్టేబుల్ అప్పలనాయుడు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అయితే అదే చెరువు గట్టుపై బక్కునాయుడుపేటకు చెందిన శీర అచ్చిబాబు, శీర అప్పారావు, కోన గణేష్ అనే ముగ్గురు మద్యం తాగుతున్నారు. దీంతో ఏఎస్‌ఐ, కానిస్టేబుల్ వారిని ప్రశ్నించారు. దీంతో ఆ ముగ్గురు యువకులు 'మీరెవరు మమ్మల్ని ప్రశ్నించడానికి' అంటూ తిరగబడి, పోలీసులపై దాడి చేశారు. ఏఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ముగ్గురుపై కేసు నమోదు చేసి, కొత్తవలస కోర్టుకు తరలించారు.

పాడి రైతుకు ఆర్థిక సాయం

వేపాడ, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): జాకేరు గ్రామంలో కింతాడ సత్యారావుకు చెందిన రెండు పాడి గేదెలు ఈనెల 8న మృతిచెందాయి. దీంతో సర్పంచ్ బుద్ద చిన్నమ్ములు, అప్పలనాయుడు దంపతులు, గ్రామస్థులు కలిసి ఆయనకు రూ.51వేలు అందజేశారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

విజయనగరం రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు విజయనగరం మండలం, నగర పరిధిలోని ఎరువుల షాపుల్లో గురువారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. విజయనగరం మండల ప్రత్యేకాధికారి జ్యోతిశ్రీ, తహసీల్దార్ కూర్మనాథరావు, సీఎస్‌డీటీ రామారావు, ఏవో అడ్డూరు శ్రీనివాస్ తదితరులు ఈ తనిఖీలు నిర్వహించారు. నగరంలోని నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న రెండు షాపులు, రాకోడు గ్రామంలో ఉన్న ఆర్‌ఎస్‌కేలని ఈ బృందం తనిఖీ చేసింది. ఈసందర్భంగా తహసీల్దార్ కూర్మనాథరావు మాట్లాడుతూ ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, ఎక్కువ ధరకు అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

● గజపతినగరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలపై వి జిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ.భాస్కరరావు, హెచ్‌సీ కామేశ్వరరావు, పీసీ తిరుపతిరావులతో పాటు వ్యవసాయశాఖ అధికారులు దాడులు చేపట్టారు. స్టాక్ వివరాలు పరిశీలించారు. రైతులకు యూరియాతో పాటు గుళికలు అట్టగడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. అలాగే పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనతో ఏవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి స్వగ్రామం వచ్చి..

● లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



బాలాజీ(ఫైల్)

రామభద్రపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమ్మతల్లి ఆలయం సమీపంలో జాతీయరహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ వెలమల ప్రసాద్ కథనం మేరకు.. బొబ్బిలి మండలం పారాదికి చెందిన పువ్వల బాలాజీ (23) బైకుపై రామభద్రపురం వైపు వస్తున్నాడు. విజయనగరం నుంచి పార్వతీ పురం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాలాజీ విశాఖ జిల్లాలోని తగరపువలస దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బాలాజీ కి తండ్రి వెంకటరమణ, తల్లి లక్ష్మి ఉన్నారు. తమను వృద్ధాప్యంలో ఆదుకుంటా డనుకున్న కుమారుడు మృతితో తల్లిదండ్రుల రోదిస్తున్నారు. వినాయక చవితికి స్వగ్రామానికి వచ్చి మృతిచెందడంతో గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి గురువారం బాడంగి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఏరియా ఆసుపత్రిలో గర్భిణి మృతి

● వైద్య సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

పాలకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏరియా ఆసుపత్రిలో నిండు గర్భిణి బుధవారం మృతిచెందింది. తంపటాపల్లికి చెందిన బొమ్మాళి పద్మ కుటుంబ సభ్యులతో కలిసి భర్త అనీల్(రవి) ప్రసవం కోసం బుధవారం ఉదయం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. పురిటినొప్పులతో బాధపడుతున్న పద్మను వైద్య సిబ్బంది సేవలందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్‌గా ఉన్న ఈఎన్‌టీ వైద్యులు రాజేశ్వరరావు పర్యవేక్షణలో వైద్య సిబ్బంది వైద్య సేవలందించారు. గైనకాలజిస్ట్ అందుబాటులో లేరు. అయితే గైనకాలిస్ట్ సమక్షంలో వైద్యం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు. కొద్దిసేపు వైద్యం అందించిన తర్వాత ఆమె పరిస్థితి విషమంగా మారడంతో డ్యూటీ డాక్టర్ భారతికి ఫోన్‌లో సమాచారం అందించారు. విషయం తెలుసుకొని ఏరియా ఆసుపత్రికి చేరుకొని వైద్య పరీక్షలు చేశారు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని శ్రీకాకుళం తరలించాలని సూచించారు. కొద్దిసేపటి తర్వాత పద్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్య సిబ్బంది సకాలంలో గైనకాలజిస్ట్‌కు సమాచారం ఇవ్వలేదని నిలదీశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చిరంజీవితో వాగ్వాదానికి దిగారు. తంపటాపల్లికి చెందిన పెద్దలు ఏరియా ఆసుపత్రికి చేరుకోగా సిబ్బంది, వైద్యులు అందించిన వైద్యంపై వివరించారు. దీంతో వారు శాంతించారు. ఎటువంటి పోస్టుమార్టం నిర్వహించకుండానే కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని తరలించారు. పద్మకు మూడో కాన్పు కావడం గమనార్హం. కాగా ఏరియా ఆసుపత్రిలో బుధవారం నిండు గర్భిణి మృతిపై మన్యం డీసీహెచ్‌ఎస్ జి.నాగభూషణరావు వైద్య సిబ్బందిని, వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, కుటుంబ సభ్యులను విచారణ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి..

జియ్యమ్మవలస, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో చింతలబెలగాం పంచాయతీ తుమ్మలదత్తివలసకు చెందిన బంకపల్లి సత్యనారాయణ (45) ఈనెల 26న కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే బైపాస్ క్యాబిన్ వద్ద విధులు నిర్వర్తిస్తుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. ఆయన మొదట మిలటరీలో పనిచేశాడు. పదవీ విరమణ అనంతరం రైల్వే ట్రాక్ మెంటైనెన్స్ నాలుగో తరగతి ఉద్యోగిగా చేరాడు. అయితే సంఘటన జరిగిన అనంతరం విషయాన్ని సత్యనారాయణ కుటుంబానికి సమాచారం చేరవేశారు. అనంతరం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు మృతదేహాన్ని బుధవారం తుమ్మలదత్తివలసకు కుటుంబ సభ్యులు తీసుకుని వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సత్యనారాయణకు భార్య సంధ్యారాణి, కుమారుడు నాని, కుమార్తెతో పాటు తల్లిదండ్రులు బంకపల్లి రాములు, రేగాలమ్మ, ముగ్గురు అక్కా చెల్లెల్లు ఉన్నారు. దీనిపై సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి ఒకరు..

బెలగాం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురం పట్టణంలోని గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గూడ్స్ షెడ్ రోడ్డులో నివసిస్తున్న బాడితి రాము(42) ఓ స్కూల్ సమీపంలోని రెండు ఫ్లోర్ల ఇంటికి పెయింటింగ్ వేస్తున్నాడు. ప్రమాదవశాత్తు పైనుంచి పడిపోయాడు. ప్రహరీకి తల తగలడంతో మృతిచెందాడు. రాముకు తల్లి, ఇద్దరు సోదరీమణులు, నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిపారు.

హైదరాబాద్‌లో కురుపాం యువకుడు..

కురుపాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కురుపాం శివ్వాలవీధికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కురుపాం శివ్వాలవీధికి చెందిన గొర్లి సింహచలం కుమారుడు గొర్లి సాయి(23) హైదరాబాద్‌లో అల్యూమినియం ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంతో సురవరం నుంచి జీడిమెట్ల వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీకొని మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన బంధువులు హైదరాబాద్ వెళ్లారు. సింహాచలానికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

పాము కాటుతో ఒకరు..

కొమరాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గంగరేగువలస గ్రామానికి చెందిన దాసరి తిరుపతిరావు(48) పాముకాటుకు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బుధవారం వినాయక పూజ సామగ్రిని స్థానిక జంఝావతి కాలువలో నిమజ్జనం చేయడానికి వెళ్లిన సమయంలో పాము కాటేసింది. వెంటనే కుటుంబసభ్యులు పార్వతీపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు తెలిపారు. తిరుపతి రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిగింది.

డ్రైవర్ నిర్లక్ష్యంతో విరిగిన కూలీ చెయ్యి

ఎస్.కోట రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్‌వీఎస్ ప్యాలెస్ లేఆవుట్‌లో ఒక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కూలీ చేయి విరిగిపోయింది. సీఐ నారాయణమూర్తి గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ లేఆవుట్‌లో బంక రమేష్ అనే డ్రైవర్ తన ట్రాక్టర్ రోటోవేటర్‌లో రాయి ఇరుక్కుందని.. తీయాలని అక్కడ పనికి వెళ్తున్న మునగపాక అప్పారావును కోరాడు. ఈ రాయి తీసే పనిలో అప్పారావు ఉండగా.. రమేష్ నిర్లక్ష్యంగా ఇంజన్ ఆన్‌చేశాడు. దీంతో అప్పారావు చేయి విరిగిపోయింది. క్షతగాత్రుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడ్డ వ్యక్తిని విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు.

నిధులు లేక.. పనులు పూర్తికాక

●అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాలు ●ఇదీ కాశీపట్నం కస్తూర్బాగాంధీ పాఠశాలలో పరిస్థితి



అర్ధాంతరంగా నిలిచిపోయిన కేజీబీవీ భవన నిర్మాణం

మక్కువ రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నంలో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల భవన నిర్మాణాలు నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రెండుభవనాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో చాలీచాలని వసతులతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.

కేజీబీవీ పాఠశాలలో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకూ 274 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 14 గదులు మాత్రమే ఉన్నాయి. డార్మెటరీ, టాయిలెట్‌కు ఈ గదుల్లోనే వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుగదులతో రెండుభవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. దీంతో 2016-17 సంవత్సరంలో ఆర్ఎంసీ కింద నాలుగు గదుల నిర్మాణానికి 42 లక్షలు, 2021- 22లో నాడునేడుఫేజ్-2 కింద రెండుగదుల నిర్మాణానికి 52 లక్షలు మంజూరుకావడంతో సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో పనులు చేట్టారు. ప్రస్తుతం రెండు భవనాలు శ్లాబ్ వరకు పనులు చేపట్టి వదిలేశారు. భవనాలకు ప్లాస్టింగులు చేయలేదు. గుమ్మాలు అమర్చలేదు. గచ్చుల కూడ వేయలేదు. ఇక్కడ విద్యార్థినుల సంఖ్యఎక్కువగా ఉండడం, సరిపడా గదులులేకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. తరగతులు, డార్మిటరీ, వంట గదులు, టాయ్‌లెట్ రూములు అన్నీ ఒకేచోట ఉండడంతో తరగతుల నిర్వహణలో ఉపాధ్యాయులు సైతం ఇబ్బందిపడుతున్నారు. కాగా రెండు భవనాలు పూర్తి చేస్తే విద్యార్థినులకు వసతి సౌకర్యాలు సమకూరుతాయని కేజీబీవీ ప్రిన్సిపాల్ జి.దుర్గ తెలిపారు. తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకొని పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం నిధులు విడుదల చేసిన మేరకు పనులు చేపట్టామని సర్వశిక్షాయాభియాన్ ఏఈ శ్రీకర్ తెలిపారు. నాడు-నేడు పథకం కింద రెండు గదులు భవనాల నిర్మాణానికి 52 లక్షలు మంజూరుకాగా ఆ మేరకు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్ఎంసీ కిందమంజూరైన భవనం పనులు ఎవరు చేపట్టి పూర్తిచేసినా ఎటువంటి ఆటంకంలేకుండా బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి: మంత్రి



ప్రజాదర్బార్‌లో వినతిని స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. గురువారం పట్టణంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాచిపెంట మండలంలోని గురువునాయుడు పేట పంచాయతీ పరిధిలో 11 గ్రామాలకు రైతులు రెండు సంవత్సరాలుగా సబ్ స్టేషన్ ఓవర్ లోడు వల్ల విద్యుత్ సరఫరా ఎప్పటికప్పుడు హెచ్చుతగ్గులుకావడంతో వ్యవసాయ పనుల్లో తీవ్ర ఇబ్బందు ఎదుర్కొంటున్నామని మంత్రికి వివరించారు. దీంతో మంత్రి విద్యుత్ అదికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సాలూరు మండలంలోని మామిడిపల్లికి చెందిన గ్రామస్థులు పీఏసీఎస్‌కు కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):గుమ్మలక్ష్మీపురం మద్యం దుకా ణంపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో గురువారం ఎమ్మార్పీకి వినియోగదారులకు అమ్ముతున్నరో లేదోనని తెలుసుకు నేం దుకు సీక్రెట్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని కోరారు.

ఖైదీల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

పాలకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):ఖైదీల ఆరోగ్యంపై దృష్టిసారించాలని జిల్లా జైళ్లశాఖాధికారి కె.మోహన్‌రావు కోరారు. గురువారం పాలకొండ సబ్ జైలును సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ జోగులు, హెడ్ వార్డర్ బి.విజయకుమార్, సిబ్బంది హేమసుందర్, బి.నరసింహులు, ఎం.శ్రీనివాసరావు, జీపీటీ నాయుడు, హరికృష్ణ, పి.అప్పారావు, ఎల్.లక్షుంనాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

బెలగాం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ మీటర్లు రద్దు చేయాలని వామపక్ష నాయకులు కోరారు. విద్యుత్ సంస్కరణ చట్టాల అమలుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ, అదానీలకు ప్రజల సంపదను దోచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.గురువారం పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి అంబేద్కర్‌భవనం వరకు ర్యాలీ నిర్వహించారు.విద్యుత్ చార్జీలపై నిర్వహించిన ఉద్యమంలో 25 ఏళ్ల కిందట ముగ్గురు మృతిచెందడంతో అమరవీరుల ప్రతజ్ఞా దినం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సీపీఐ నాయకులు ఆర్వీఎస్ కుమార్, సీపీఐఎంఎల్ న్యూ లిబరేషన్ నాయకులు పి.సంగం పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):రానున్న రెండురోజుల్లో వాయుగుండం ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేఖరం ఒక ప్రకటనలో తెలిపారు. వాగులుదాటే సమయంలో, వర్షం వల్ల గోడలు తడిచిపోయిన ఇళ్లల్లో నివసించడం తదితర అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరిశీలించాలి

గరుగుబిల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆహార నియమావళితోనే దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచవచ్చని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగు తీరును ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది పరిశీలించాలని పేర్కొన్నారు. చినగుడబలో వైద్య సిబ్బంది చేపడుతున్న కార్యకమాలను పరిశీలించారు.

రైతులకు యూరియా అందించాలి



బెలగాం: కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

బెలగాం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు యూరియా తక్షణమే అందజేయాలని ఏపీ రైతుసంఘం నాయకుడు ఎం.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు ఎరువుల కొరత నివారించాని పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద రైతు సంఘం నాయకులు గురువారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బంటు దాసు, రెడ్డి లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

●పాలకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యూరియాను సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొండలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, బొత్స గౌరునాయుడు, పిట్ట రమణ, కిమిడి త్రిపురాంతకరరావు, బచ్చల నానాజీ, వండాన కూర్మారావు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏవో పి.శంకరరావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 454 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 324 మెట్రిక్ టన్నుల పంపిణీ చేశామని, మిగతా యూరియా త్వరలోనే రానుందని చెప్పారు.

●భామిని, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని ఏవో తిలక్ తెలిపారు. కొద్దిరోజులుగా మండలంలో యూరియా కరువు కొరత నెలకొంది. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు భామిని రైతు సేవా కేం ద్రంలో గురువారం అధికారులు ఎరువులు విక్రయించారు.

సీతంపేట మన్యంలో పొంగుతున్న గెడ్డలు



రోడ్డుపై ప్రవహిస్తున్న సంతమల్లి గెడ్డ

సీతంపేట రూరల్,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):సీతంపేట మన్యంలో అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మన్యంలో బుధవారం కురిసిన భారీవర్షానికి గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. దోనుబాయికి వెళ్లే మార్గంలోని చంద్రమ్మతల్లి గెడ్డ,కుసిమి-సంతమల్లి గ్రామాల మధ్యలో ఉన్న సంతమల్లి గెడ్డలు పొంగి రోడ్డుపై నుంచి ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో నీటి ప్రవాహం తగ్గడంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

జలదిగ్బంధంలో గారమ్మకాలనీ

పాలకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గారమ్మకాలనీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలదిగ్బంధంలో చిక్కుకుంది. కాలనీలో ప్రస్తుతం రోడ్లపై నీరు ఉండిపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

చిత్రకళలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చిత్రకళలపై ఆసక్తి పెంచేందుకు దృష్టిసారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. బుధవారం రావివలస డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రుగుడ శ్రీనివాసరావు పెన్సిల్‌తో కలెక్టర్ చిత్రాన్ని చిత్రీకరించి అందించారు. చిత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, శ్రీనివాసరావును అభినందించారు.

వారంలో.. ఒకరోజే

(5వ పేజీ తరువాయి)

చేయడంలో ఒక్క అడుగు ముందుకు.. మూడుగుల వెనక్కి అన్న చందంగా మారడంతో గ్రావీటి స్కీమ్ కాగితాలకే పరిమితమయ్యింది.

దారుణంగా ఇన్‌ఫిల్టర్ బావులు

పార్వతీపురం పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే నాగావళి నదిలోని ఇన్‌ఫిల్టర్ బావుల పరిస్థితి దారుణంగా మారింది. ఎప్పుడో ఆరు దశాబ్దాల కిందట మున్సిపాల్టీ ఏర్పడినప్పుడు నాలుగు ఇన్‌ఫిల్టర్ బావులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 1,2,3 ఇన్‌ఫిల్టర్ బావులు వాడుకలో ఉండగా, నాలుగో బావి చుటూ ఇసుక మేటలు వేయడంతో వృథాగా పడిఉంది. మొదటి ఇన్‌ఫిల్టర్ బావిలో నీటిని తోడే 17.5 హెచ్‌పీ మోటారుపైనే జిల్లా కేంద్రానికి తాగునీటి సరఫరా ఆధారపడి ఉంది. ఈ మోటారుపై ఒత్తిడిని తగ్గించడానికి అధికారులు రెండో ఇన్‌ఫిల్టర్ బావిలోని 7.5 హెచ్‌పీ మోటారు వినియోగించే వారు. అయితే, ఈ గొట్టాలు గత నెల నాగావళి నదికి వచ్చిన వరదల్లో కొట్టుకుపోయాయి. దీంతో ఇంజనీరింగ్ అధికారులు 3వ ఇన్‌ఫిల్టర్ బావికి సంబంధించిన 10 హెచ్‌పీ మోటారును వాడుకలోకి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం నాగావళికి వస్తున్న వరదలతో 3వ బావిలోని మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. తాగునీటి సరఫరాను మెరుగుపరచాలనే లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రెండు 5 హెచ్‌పీ మోటార్లు కూడా వరదనీటిలో మునిగిపోయాయి. దీంతో పాటు తోటపల్లి ప్రధాన పంప్‌హౌస్ నుంచి బూస్టర్ పంప్ హౌస్‌కు నీటిని సరఫరా చేసే రెండు 75 హెచ్‌పీ మోటర్లలో ఒక మోటారు నెల రోజుల కిందట మరమ్మతులకు గురైంది. ఈ విషయం ఇంజనీరింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఒకపక్క నాగావళి నదిలోని ఇన్‌ఫిల్టర్ బావుల వద్ద ఉన్న మోటార్లు, మరోపక్క ప్రధాన పంప్‌హౌస్, బూస్టర్ పంప్‌హౌస్‌లోని మోటార్లకు కాలం చెల్లుతుండడంతో భవిష్యత్‌లో జిల్లా కేంద్ర వాసులకు తాగునీటి కష్టాలు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

జనాభాకు తగ్గట్లు సరఫరా కాని నీరు

పార్వతీపురం మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్లు తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. 2012 జనాభా లెక్కల ప్రకారం అప్పట్లో ఈ మున్సిపాలిటీ జనాభా 55 వేల మంది. గత 13 ఏళ్లలో మున్సిపాలిటీ చుట్టు పక్కల కాలనీలు, రియల్ ఎస్టేట్ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. దీంతో ప్రస్తుత జనాభా అనాధికార లెక్కల ప్రకారం 80 వేలమందికి పైగా ఉంటారనేది అంచనా. వీరికి కనీసం రోజుకు 40 వేల లీటర్ల నీటిని సరఫరా చేయాలి. రోజును పక్కన పెడితే వారానికి కూడా 40 వేల లీటర్లు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడో పార్వతీపురం మున్సిపాలిటీ ఏర్పడినప్పుడు గరుగుబిల్లి మండలం తోటపల్లి సమీపంలోని నాగావళి నది నుంచి పార్వతీపురం పట్టణం వరకు తాగునీటి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పైపులైన్ ద్వారానే 30 వార్డులకు తాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే, ఆరు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్ కావడంతో ఎక్కడికక్కడే లీక్‌లు ఏర్పడి తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం..

ప్రతిఏడాది తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్నాం. వేసవిలో ఎండలతో నాగావళి నది ఎండిపోయి నీరు సరఫరా కావడం లేదు. వర్షాకాలంలో వరదలతో మోటార్లు మరమ్మతులకు గురై నీటిని సరఫరా చేయలేకపోతున్నామని ఇంజనీరింగ్ అధికారులుచెబుతున్నారు. వారంరోజులకొకసారి తాగునీటిసరఫరా చేస్తుండడం విచారకరం.

-ఆర్.గోపాలరావు, పార్వతీపురం

హామీలే తప్ప ఆచరణ లేదు..

పాలకులు, అధికారుల అశ్రద్ధ, నిర్లక్ష్యం వల్లే జిల్లా కేంద్ర వాసులు బిందెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.ఎన్నికలసమయంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని పాలకులు హామీలు ఇవ్వడం తప్ప, ఆచరణలో చూపించడం లేదు. యథా రాజా తథా ప్రజా అన్న చందంగా పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారు.

-జీవీ రమణ, ప్రజా సంఘ నాయకుడు, పార్వతీపురం

పక్కాగా సరఫరా చేస్తాం

పార్వతీపురం పట్టణ ప్రజలకు పక్కాగా తాగునీటిని సరఫరా చేసేందుకు మా శక్తి వంచన లేకుండా పని చేస్తున్నాం. నాగావళికి వరద ఉధృతితో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడం వాస్తవమే. ఆ సమస్యను అధిగమించేందుకు మా ఇంజనీరింగ్ అధికారులు కష్టపడుతున్నారు. మోటార్లను యుద్ధప్రాతిపదికన బాగు చేసి నీటిని సరఫరా చేస్తాం.

-శ్రీనివాసరాజు, ఇన్‌చార్జి కమిషనర్, పార్వతీపురం మునిసిపాలిటీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జియ్యమ్మవలస, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినకుదమ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ శంకరరావు తెలిపారు. విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్‌స్టేషన్ పరిధిలో గెడ్డ తిరువాడ 11కేవీ ఫీడర్ లైన్ కింద, రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించే పనులు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టీఎన్ వలస, అంకవరం, గెడ్డ తిరువాడ, నీచుకవలస, గదబవలస, ఇటిక, కేటీ వాడ గ్రామాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

స్త్రీశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో శనివారం నిర్వహించే స్త్రీశక్తి కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒక ప్రకటనలో కోరారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, కూటమి నాయకులు పాల్గొవాలని కోరారు.

ఉపాధి ఏపీవోగా ఈశ్వరమ్మ

గరుగుబిల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి ఏపీవోగా మామిడి ఈశ్వరమ్మ నియామతులయ్యారు. గతంలో ఏపీవోగా విధులు నిర్వహించిన మండల గౌరీనాథ్ పాలకొండఉపాధి ఏపీవోగా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పాలకొండ ఏపీవోగా విధులు నిర్వహించిన ఈశ్వరమ్మ గురువారం ఏపీవోగా బాధ్యతలు స్వీకరించారు.

బస్సులు పునరుద్ధరించాలి

పాలకొండ/సీతంపేట రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు అందడం లేదని టీపీసీ సభ్యురాలు ఎం తేజోవతి పేర్కొన్నారు. సీతంపేట ఏజెన్సీలో గురువారం పర్యటించిన ఆమె ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తేజోవతి మాట్లాడుతూ పూతికవలస,శంభాం రూట్లలో ఆర్టీసీ బస్సులను వెంటనే పునరుద్దరించాలని కోరారు.

వలంటీర్‌ను నియమించాలి

కురుపాం రూరల్, 28 ఆగస్టు (ఆంధ్రజ్యోతి) జి.శివడ పంచాయతీ పరిధిలోని మధురవలస ప్రాథమిక పాఠశాలలో సవర భాషా వలంటీరును నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గంగారావు కోరారు.ఈ మేరకు డిప్యూటీ డీఈవోకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో 15 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారని, వీరిలో ఐదుగురు సవర తెగకు చెందిన వారు ఉన్నారని తెలిపారు.

అందుబాటులోకి వస్తే.. ఇక్కట్లు తప్పినట్లే!

(5వ పేజీ తరువాయి)

వచ్చిన తరువాత నిర్మాణాలు ఊపందుకున్నాయి.

● జిల్లాకు మంజూరైన 20 ఎంపీఎఫ్‌సీలలో బలిజిపేట మండలం అజ్జాడ, గళావలి, పలగరలో రెండు చోట్ల, సీతానగరం మండలంలో బూర్జ, ఆర్‌వీ పేట, గెడ్డలుప్పిలలో మంజూరుచేశారు. కొమరాడ, జియ్యమ్మవలస మండలంలో చినమేరంగి, గరుగుబిల్లి మండలంలో రావివలస, వీరఘట్టం, పాలకొండలో రెండేసి చొప్పున, ఆర్‌బీఆర్ పేట, అర్థలి, బామిని, బత్తిలి గ్రామాల్లో, మక్కువ, పార్వతీపురం, బందలుప్పిల్లో ఎంపీఎఫ్‌సీలు మంజూరు చేశారు. రూ. 823.41 కోట్లు కేటాయించారు.

● ఆర్‌బీఆర్ పేట, కొత్తవలస, ఎం.సింగుపురం, లోవిడి లక్ష్మీపురం , సంతనర్సిపురం, యు.వెంకమ్మపేట, కొమరాడ, బెల్లుముడ, లివిరి, అజ్జాడలో ఎంపీఎఫ్‌సీల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి.పలగర, గళావిలిలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇంకా ఏడు భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పార్వతీపురం, కవిరిపల్లిలో సూపర్ స్ట్రక్చర్ లెవెల్‌లో, బందలుప్పి, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, బలిజిపేట, సీతానగరం మండలాల్లో భవనాలు బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయి. ఇంతవరకు రూ. 469.52 కోట్లు పనులు జరగ్గా రూ. 454.02 కోట్లు చెల్లించారు. ఇంకా 369.39 కోట్లువిలువైన పనులు చేయాల్సిఉంది. పనులన్నీ అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రెండు నెలల్లో పంట చేతికి రానున్న నేపథ్యంలో నిర్మాణాలు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

తుది అంకానికి మెగా డీఎస్సీ

(5వ పేజీ తరువాయి)

మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీలు 210, పాఠశాల సహాయకుల క్యాడర్‌లో తెలుగు 14, హిందీ 14, ఆంగ్లం 23, గణితం 8, భౌతికశాస్త్రం 32, జీవశాస్త్రం 20, సాంఘిక శాస్త్రం 62, పీఈటీ 63 మొత్తం 446 టీచర్ ఖాళీలు, ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీలు 60, పాఠశాల సహాయకుల క్యాడర్‌లో ఆంగ్లం 7, గణితం 25, భౌతిక శాస్త్రం 24, జీవశాస్త్రం 16, సాంఘిక శాస్త్రం 5 మొత్తం 137 టీచర్ పోస్టులు ఖాళీలను చూపించారు. వీటి భర్తీకి ఉమ్మడి జిల్లాలో ప్రకటించిన మెరిట్ లిస్ట్ నుంచి రిజర్వేషన్, నియమ నింబధనలకు అనుగుణంగా ఈ నెల 26న అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించారు.

ఉప్పొంగుతున్న నదులు

(5వ పేజీ తరువాయి)

నది ఉధృ తంగా ప్రవహిస్తుండడంతో పలు గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే, సువర్ణముఖికి వరద రావడంతో దండిగాం కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తుంది. దీంతో 14 గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పలు వాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి. వరద వచ్చేనప్పుడు వాగుల్లో దిగడం, కాజ్‌వేలను దాటడం చేయవద్దని సాలూరు తహసీల్దార్ నీలకంఠరావు కోరారు.

● ఒడిశా ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో నాగావళి నదిలోకి 8 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు అప్రమత్తమై తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను, ప్రస్తుతం 104.21 మీటర్లు, 2.534 టీఎంసీలకు గాను 2.032 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1,220 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● ఎగువన కురుస్తున్న వర్షాలతో మక్కువ మండలంలోని వెంగలరాయ సాగర్ జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. అధికారులు అప్రమత్తమై బుధవారం రాత్రి 600 క్యూసెక్కుల నీటిని సువర్ణముఖి నదిలోకి విడిచిపెట్టారు. మక్కువ మండలం కవిరిపల్లి వద్ద కాజ్‌వేపైకి వరద నీరు పెరగడంతో బుధవారం సాయంత్రం రాకపోకలు బందయ్యాయి. నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్టు ఇరిగేషన్ జేఈ రాజశేఖర్ తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించండి: సబ్ కలెక్టర్

కురుపాం,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం కురుపాం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ చాణిక్యను నిలిచిపోయిన పనులు, ప్రహరి విషయమై అడిగి తెలుసుకున్నారు.

● పార్వతీపురం రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):కృష్ణపల్లిలో సబ్ కలెక్టర్ డాక్టర్ వైశాలి పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తులు పెట్టుకున్న వారి వివరాలను ఆమె పరిశీలించారు.

పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో యువకుడు గల్లంతు

పాచిపెంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో ఓ గిరిజన యువకుడు బుధవారం సాయంత్రం గల్లంతయ్యాడు. కొటికిపెంట పంచాయతీ కోడికాళ్లవలసకు చెందిన జన్ని బాలరాజు (37) రిజర్వాయర్‌లో పడి గల్లంతుకావడంతో సమాచారం మేరకు గజ ఈతగాళ్లు, డ్రోన్ కెమెరాలతో పోలీసులు వెతకడం ప్రారంభించారు. ఫైర్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం వెతికిస్తామని ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు.

నలుగురు యువకులపై కేసు నమోదు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారిలో గల కాయగూరల మార్కెట్ ఎదురుగా జరిగిన కొట్లాటకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి ప్రధాన కాయగూరల మార్కెట్ ఎదురుగా జరిగిన కొట్లాటలో వర్దన్, కుమార్, నర్సి, చిన్నలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవిందరావు పేర్కొన్నారు.

అసత్య ఆరోపణలు తగదు

పాచిపెంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):మంత్రి సంధ్యారాణిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పాచిపెంటలో విలేకరులతో మాట్లాడుతూ సంధ్యారాణి చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక నిజానిజాలు తెలుసుకోకుండా ఓ దినపత్రిక, చానల్ ఆరోపణలుచేస్తూ ప్రసారాలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఉమామహేశ్వరరావు, కొరిపల్లి సురేష్, నరసింగరావు, మతల బలరాం, పంట్ల భాస్కరరావు పాల్గొన్నారు.



